## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

పాల్వంచ, అక్టోబర్ 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి అన్నారు. పాత పాల్వంచలో సోమవారం ఆయన కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతోపాటు బీఆర్ఎస్ నాయకులతో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కొనసాగిన ప్రజావ్యతిరేక విధానాలు తెలియజేయాలన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున పక్కా వ్యూహాన్ని అమలు చేసి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, నాయకులు కిలారు నాగేశ్వరరావు, రజాక్, తొగరు రాజశేఖర్ పాల్గొన్నారు.

## అహింసామూర్తి మహాత్మా గాంధీ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): అహింసా సిద్ధాంతాన్ని చాటిచెప్పిన మహనీయుడు, జాతిపిత మహాత్మాగాంధీ అని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, పీడీ డీఆర్డీవో మధుసూదన్‌రాజు, జిల్లా రెవెన్యూ అధికారి రవీంద్రనాథ్, ఏవో గన్యా పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన



సెల్‌టవర్‌పై ఆందోళనకారులు

చుంచుపల్లి, అక్టోబర్ 2: తాము అన్ని రకాలుగా అర్హులైనప్పటికీ సింగరేణి కొత్తగూడెం ఏరియా వీకే వోసీ విస్తరణలో భాగంగా తమకు యాజమాన్యం ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని సోమవారం ఉదయం మాయాబజార్‌కు చెందిన పిచ్చేటి శివకుమార్, సాయంత్రం ధనసరి బన్ను స్థానిక సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సుమారు 286 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యాజమాన్యం వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, సంవత్సరాల తరబడి నిర్వాసిత ప్రాంతంలో తాము నివాసం ఉంటున్నప్పటికీ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సింగరేణి రెస్క్యూ టీం, టూ టౌన్ ఎస్సై జుబేదాబేగం, వన్ టౌన్ ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి ఆందోళనకారులకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో కొందరు రాజకీయ నాయకులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శివకుమార్, బన్ను టవర్ దిగి కిందికి వచ్చారు. ఈ హైడ్రామా ఇలా సద్దుమణగగా సాయంత్రం రుద్రంపూర్ ఎస్ఆర్టీ ఏరియాకు చెందిన రవితేజ అదే సెల్ టవర్ ఎక్కి తనకు కూడా ఇండ్ల స్థలం ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేశారు. సింగరేణి రెస్క్యూ టీం, పోలీసులు మళ్లీ ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారుడితో మాట్లాడుతున్నారు. సుమారు మూడు గంటల పాటు హైడ్రామా కొనసాగింది. సమాచారం అందుకున్న సింగరేణి ఎస్ఎస్వో రమణారెడ్డి ఘటనా స్థలానికి వచ్చి తిరిగి రెవెన్యూ సర్వే నిర్వహించి అర్హులైనవారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం రవితేజ టవర్ నుంచి కిందికి దిగాడు. ఎస్ఎస్వో వెంట టీబీజీకేఎస్ ఎండీ రజాక్, నాయకులు నిమ్మల రాజేశ్వరరావు, పరమేశ్, సింగరేణి రెస్క్యూ టీం ఇన్‌చార్జి అనంతరామయ్య. అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

# చేయి చేయి కలిపారు.. నిండు ప్రాణాన్ని నిలిపారు



ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

కొణిజర్ల, అక్టోబర్ 2: విష జ్వరంతో బాలిక మంచానపడింది. చికిత్స చేయించడానికి తల్లిదండ్రుల వద్ద సొమ్ము లేదు. కుమార్తె ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో తెలియక తల్లిదండ్రులు అల్లాడారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామ యువకులు పాప ప్రాణాలు కాపాడేందుకు నడుంకట్టారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని సోషల్‌మీడియాలో పోస్టింగ్స్ పెట్టారు. దీంతో తల్లిదండ్రులకు సొమ్ము అందింది. బాలిక ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ ఘటన సోమవారం సింగరాయపాలెంలో వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల రవి, రాణి దంపతుల పెద్దకుమార్తె జెస్సీ 9వ తరగతి చదువుతున్నది. వారిది నిరుపేద కుటుంబం. జెస్సీ కొద్దిరోజుల క్రితం విషజ్వరం బారిన పడింది. తల్లిదండ్రులు కుమార్తెకు స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించినప్పటికీ నయం కాలేదు. జెస్సీ పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు గత నెల 27న తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. వైద్యం చేయించేందుకు తగినంత స్తోమత లేకపోవడాన్ని గుర్తించి గ్రామానికి చెందిన యువకులు విస్తృతంగా సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెట్టారు. జెస్సీని కాపాడేందుకు ఆర్థిక సాయం చేయాలని ఆయా పోస్ట్‌ల్లో అభ్యర్థించారు. అలా రూ.70 వేలు పోగు చేసి బాధితురాలి తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం జెస్సీ స్వస్థత పొంది ఇంటికి వచ్చింది. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామీణ వైద్యుడు, రేషన్ డీలర్ నాగుల్‌మీరా 25 కిలోల బియ్యాన్ని అందించారు. కుమార్తెను ప్రాణాలను నిలబెట్టిన దాతలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. వారిని పరామర్శించిన వారిలో ఏలూరి శ్రీనివాసరావు, రహీం, వెంకటగోపి, కృష్ణార్జునరావు, రోషన్, అఫ్జల్, నాగరాజు, పొమర్తి నాగయ్య, తీగల వెంకటి, ఖాసీం బేగ్, కృష్ణ, బజారు, రావ బంటి రామయ్య, సురభి రాము, సైదా పాల్గొన్నారు.

## లింగాల కరుణమ్మకు నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

వైరా రూరల్, అక్టోబర్ 2: జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాతృమూర్తి లింగాల కరుణమ్మ ఆదివారం అనారోగ్యంతో పరిస్థితి విషమించి మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం కొష్టాల గ్రామంలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. ఆమె భౌతిక కాయానికి మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఇతర పార్టీలకు చెందిన నాయకులు దుర్గాప్రసాద్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి రమేశ్, మాచర్ల భారతి, చింతలచెరువు కోటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేశ్, నర్సింహారావు, సుధాకర్, నాగేశ్వరరావు, మల్లెంపాటి వీరభద్రరావు, కృష్ణారావు, చలపతిరావు, రవీందర్, సమత, రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, రఫీ, ప్రసాదరావు నివాళి అర్పించారు.

## తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శం

### ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 2: తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాలయాల్లో కార్పొరేట్ సంస్థలకు దీటుగా వసతులు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు, ఎంపీపీ సున్నం లలిత, జడ్పీటీసీ భారత లాలమ్మ, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, నాయకులు భూపతి నరసింహారావు, మామిళ్లపల్లి లక్ష్మణరావు, జంగాల శ్రీనివాసరావు, మాధవరెడ్డి, గాలం వలరాజు, వీరబోయిన వెంకటేశ్వర్లు, నేరళ్ల లాలయ్య, హరీశ్, చల్లా రాంబాబు, రామకృష్ణ, కట్టా శివ, మాందాసు యల్లయ్య, జమలయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుధ్య పనుల్లో జీఎం ఆనంద్, అధికారులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 2: ప్రతిఒక్కరూ తాము పనిచేస్తున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఏరియా పరిధిలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఇతర విభాగాల అధికారులు పి.శ్రీనివాసు, గిరిధర్‌రావు, నరసింహరాజు, విజయ శేఖర్‌బాబు, రవికుమార్, ధనుంజయ్‌రెడ్డి, నాగేశ్వరరావు, కలోటియా, వీరునాయక్ పాల్గొన్నారు.

### కంపెనీ స్థాయి క్రీడలను ఘనంగా నిర్వహించాలి..

కంపెనీ స్థాయి క్రీడలను ఘనంగా నిర్వహించాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం జీఎం కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్, జేకే కాలనీలో బుధ, గురువారాల్లో బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## 'చాకలి ఐలమ్మ' గద్దె ధ్వంసం: నిందితులపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 2: కాకరవాయిలోని చాకలి ఐలమ్మ విగ్రహ గద్దెను శనివారం రాత్రి కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో ధ్వంసం చేశారు. దీంతో గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించి నిందితులపై ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు సోమవారం ఘటనా స్థలానికి వెళ్లి గ్రామస్తులను విచారించారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు

## క్రీడల్లో గెలుపోటములు సహజం

ఆర్మూర్, అక్టోబర్ 2: క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని, ఓడిన జట్లు నిరాశ పడకుండా తిరిగి పోటీలో గెలిచేందుకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన వివిర రోజు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శరీరక దృఢత్వం సాధ్యమన్నారు. మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానం, నిజామాబాద్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

## 'బోయినపల్లి'కి నివాళి



పాడె మోస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 2: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ బోయినపల్లి వెంకట సుబ్బారావు (68) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీ నామానాగేశ్వరరావు, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఎర్రగుంటలోని మృతుడి ఇంటికి చేరుకుని సుబ్బారావు మృతదేహానికి నివాళి అర్పించారు. 'బోయినపల్లి' పాడెను ఎంపీ నామా నాగేశ్వరరావు మోశారు. మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. బోయినపల్లి వెంకట సుబ్బారావు సుదీర్ఘకాలం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయనకు నాటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, వైస్ రాజశేఖర్‌రెడ్డితో సత్సంబంధాలు ఉండేవి. అలాగే మాజీ మంత్రి ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి హరీశ్‌రావుతోనూ సన్నిహిత సంబంధాలు నెరిపారు.

## నేడు సింగరేణిలో కొత్త వేతనాలు చెల్లింపు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 2: సింగరేణివ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులకు మంగళవారం యాజమాన్యం కొత్త వేతనాలు జమ చేస్తుందని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. నిత్యం సింగరేణి ఉద్యోగుల వెన్నంటే ఉండే టీబీజీకేఎస్ కార్మికులకు శ్రీరామరక్ష అన్నారు. అనంతరం కార్మికుల పక్షాన నిలుస్తున్న సీఎం కేసీఆర్, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.